మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



## నెట్టెంపాడు భూసేకరణ పనులు పరిశీలన చేసిన కలెక్టర్ సంతోష్



భూసేకరణ పనులు పరిశీలన చేస్తున్న కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్, పీజెపి ఎస్ఈ రహీముద్దీన్

**గద్వాల, మే 23,ప్రభాతవార్త:** జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ భూసేకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్.శుక్రవారం ధరూర్ మండలంలోని చింతరేవుల గ్రామాన్ని సందర్శించి జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు సంబంధించిన భూ సేకరణ వివరాలు,లేఅవుట్ మ్యాప్,పెగ్ మార్కింగ్ చేసిన ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ సర్వే పనులకు నిధుల కొరత లేకపోవడంతో,ఏ విధమైన ఆలస్యం లేకుండా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రతి రోజు ఎంత మేర భూమిపై సర్వే జరుగుతోంది,ఎన్ని ఎకరాలు పూర్తయ్యాయి అనే వివరాలను స్పష్టంగా నమోదు చేసి నివేదిక సమర్పించాలని అన్నారు. సర్వే,పెగ్ మార్కింగ్ పనులను ఒకేసారి జరపుతూ,రైతులను చైతన్యపరచి వారి సహకారంతో భూసేకరణను సమర్థవంతంగా పూర్తి చేయాలని అన్నారు.క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే ల్యాండ్,6 నంబనము నమ్మకం? ఇరిగేషన్,రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ,నీటి పారుదల శాఖ ఎస్.ఈ. రహీముద్దీన్,ఆర్డీవో శ్రీనివాసరావు,ధరూర్ తహసీల్దార్ భూపాల్ రెడ్డి,తదితర అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఉంచాలి

**గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, మే 23,ప్రభాతవార్త:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ఎరువులు,విత్తనాల జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు సకాలంలో అందించడమే ప్రధాన లక్ష ్యమని అన్నారు.టాస్క్ ఫోర్స్ టీంలు తమ పరిధిలోని విత్తనాల విక్రయ షాపులను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు.నకిలీ విత్తనాలు జిల్లాలోకి రాకుండా అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తెలిపారు.రైతులు మోసపోకుండా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ధ్రువీకరించిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేసేలా చూడాలని సూచించారు.డిఏపీ,కాంప్లెక్స్ ఎరువుల ప్రస్తుత స్టాక్, అవసరమైన పరిమాణాన్ని మండలాల వారీగా పూర్తి జాబితాను వెంటనే సమర్పించాలని ఆదేశించారు.గ్రీన్ మెన్యూర్,ఎరువుల అవసరం ఉంటే, సంబంధిత వివరాలను తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.వ్యవసాయ శాఖాధికారులు రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి అవసరమైన సలహాలు, సూచనలు చేయాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి ్మ నారాయణ,నర్సింగ రావు,డిఎస్పీ మొగలయ్య, వ్యవసాయ అధికారి సక్రియ నాయక్,ఏడీఏ సంగీత లక్ష్మి ్మ, మండల వ్యవసాయాధికారులు, పోలీసు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## 4 రోజులు 16 బృందాలు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

- మహబూబ్‌నగర్‌లోని 259 డీలర్ ఔట్ లెట్‌లను తనిఖీ చేయాలి
- నకిలీ పత్తి విత్తనాల నియంత్రణకు కఠిన చర్యలు
- కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశం
- నకిలీ పత్తి విత్తనాల నియంత్రణపై టాస్క్ ఫోర్స్ సమన్వయ సమావేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో మే 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ అనుమతి లేని బిజి 3 నకిలీ పత్తి విత్తనాలు నియంత్రణకు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్ లు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ డి.జానకితో కలిసి నకిలీ విత్తనాల నియంత్రణపై వ్యవసాయ అధికారులు,పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ టీమ్‌ల సమన్వయ సమావేశంలో కలెక్టర్ వర్షాకాలం వర్షాకాల ముందస్తు వ్యవసాయ ప్రణాళిక, నకిలీ పత్తి విత్తనాల నియంత్రణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ నెల కంటే ముందే వర్షాలు పడుతున్నందున వ్యవసాయ పనులు మొదలు కానున్నట్లు తెలిపారు. జిల్లాలో వరి తర్వాత ఎక్కువగా పత్తి సాగు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారుగా 75 వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేని బిజి-3 నకిలీ పత్తి విత్తనాలు నియంత్రణకు పోలీస్, వ్యవసాయ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ టీమ్‌లు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతి లేని బిజి 3 పత్తి విత్తనాలు నిల్వ చేయడం,అమ్మడం, విత్తడం, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మడం చట్ట రీత్యా నేరం అన్నారు. అటువంటి వారిపై 10 సం.ల వరకు జైలు శిక్ష, పిడి.ఆక్ట్ నమోదుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.నకిలీ బిజి 3 పత్తి విత్తనాల వలన భూసారం దెబ్బ తినడమే కాక వాతావరణం కలుషితం అవుతుందని తెలిపారు. ప్రభుత్వం అందుకే వాటిపై నిషేధం విధించినట్లు తెలిపారు.నకిలీ పత్తి విత్తనాలు చే తయారు చేసిన దుస్తులు ధరిస్తే స్కిన్ క్యాన్సర్ వస్తుందని అన్నారు. నేటి నుంచి 28 వరకు 16 టాస్క్ ఫోర్స్ టీమ్‌లు జిల్లాలో 259 డీలర్ ఔట్ లెట్‌లను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో గడువు తేదీ దాటిన విత్తనాలు అమ్మినా, నిల్వ ఉంచిన,అనుమతి లేని నకిలీ విత్తనాలు విక్రయించిన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే 1,19,000 పత్తి విత్తనాలు సరఫరా చేసినట్లు వెల్లడించారు. నాణ్యమైన ప్రభుత్వ అనుమతి గల బిజి 2 పత్తి విత్తనాలు మాత్రమే రైతులు లైసెన్స్ ఔట్ లెట్ డీలర్ల నుండి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మళ్లీ జూన్ మొదటి వారం లో టాస్క్ ఫోర్స్ టీమ్‌లతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. చెక్‌పోస్ట్‌ల్లో కూడా గట్టి నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ పోలీస్ శాఖ తరఫున నకిలీ పత్తి విత్తనాలు నియంత్రణ చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని, ఎటువంటి సమాచారం ఉన్నా ముందుగా తెలిపితే పోలీస్ శాఖ నుంచి తగిన ఫోర్స్ పంపిస్తామని అన్నారు. గత సంవత్సరం జడ్చర్ల మండలం గోపులాపూర్ లో 151 కిలోలు,51 కిలోలు నకిలీ పత్తి విత్తనాలు పట్టుకొని రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం కూడా గోపులా పూర్ లో లక్ష 50 వేల రూ.ల విలువ కలిగిన 30 కిలోలు నకిలీ పత్తి విత్తనాలు మధు సూదన్ రెడ్డి వద్ద స్వాధీనం చేసుకొని చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. 5 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు,డీలర్ ఔట్ లెట్ లను తనిఖీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అదనపు ఎస్.పి.రాములు, డిఎస్పీ వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి డీఎస్పీరమణా రెడ్డి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్, సిఐలు, ఎస్ఐలు,వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

## ఎడ్యుకేషనల్ హబ్ స్థల పరిశీలన..

**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, మే 23 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణానికి టిజిఇడబ్ల్యుఐడిసి ఎండి గణపతి రెడ్డి స్థల పరిశీలన చేశారని, త్వరలోనే టెండర్ ప్రక్రియ చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ యండి గణపతిరెడ్డితో కలిసి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ వనపర్తి నియోజకవర్గంలో నిర్మించబోతున్నామని అన్నారు. మార్చి 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఈ క్రమంలో సంబంధిత అధికారులతో స్థల పరిశీలన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పీర్లగుట్ట, నాగవరం శివారులోని ప్రభుత్వ స్థలాన్ని, అదేవిధంగా మెడికల్ కళాశాల ప్రక్కన స్థలాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు ఎస్ఈ షఫీ మియా, ఈఈ రామచంద్ర, డిఈ వెంకట్ రెడ్డి, డిఈఈ ప్రతాప్, ఏఈలు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మాజీ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, మాజీ ఎంపిపి కిచ్చారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, మాజీ కౌన్సిలర్లు, రెవిన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగేళ్లలో 14వేల ఇండ్లు అందజేస్తాం

- బిఆర్ఎస్ హయంలో ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలే
- ప్రజా ప్రభుత్వంలో పేదల సంక్షేమం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- వెంకటాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ



ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 23 ప్రభాతవార్త:** రానున్న 4 ఎండలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 14 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని, ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ నియోజకవర్గం, వెంకటాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అంతకుముందు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ప్రొసీడింగ్స్ పత్రాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని చెప్పారు. ప్రజాపాలనలో ఇల్లు లేని నిరుపేదలకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆయన స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ పాలనలో ఇందిరమ్మ ఇండ్లను అవమానం చేస్తూ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తానని మోసం చేశారని, పది సంవత్సరాల కాలంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం కులమతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, ఓబిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్రాములు, మాధవ రెడ్డి, హన్మంతు నాయక్, ప్రసాద్ ముదిరాజ్, గోపాల్, గోవింద్ యాదవ్, ధర్మపూర్ నర్సింహారెడ్డి, పోతన్ పల్లి మోహన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, హౌసింగ్ పిడి వైద్యం భాస్కర్, ఎంపిడివో కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## లేఖ వెనుక కాంగ్రెస్ కుట్ర ఉందా..?

- కేసీఆర్‌ను కలిసే పరిస్థితి కూడా కవితకు లేదా..
- ఎమ్మెల్సీ కవిత తన తండ్రి కెసిఆర్‌కు రాసిన లేఖపై ఎంపీ డీకే అరుణ కౌంటర్



4

## ఒక్కో అధికారికి.. 3 శాఖలు

- అదనపు కలెక్టర్ నుంచి నుంచి జిల్లాధికారుల దాకా..
- జోగులాంబ గద్వాల జిల్లాలో ఇంచార్జ్ అధికారులే..
- ముందుకు సాగని ప్రజాపాలన..

4

జోగులాంబ గద్వాల జిల్లాలో అన్ని శాఖాలకు అధికారులు లేక పాలన ముందుకు సాగడం లేదు. ఒక్కో అధికారికి రెండు మూడు శాఖలు కేటాయించడంతో ఏ శాఖకు సరైన న్యాయం చేయలేకపోతున్నారని అనే అరోపణలు ఉన్నాయి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పోస్టు జెడ్పీ సిఈఓ డీఈవో పోస్టులు సైతం ఖాళీగా ఉండడం పాలన గాడి తప్పతోందని అభిప్రాయం వ్యక్తంమవుతున్నది. ఇక చేసేదేమి లేక ఉన్న అధికారులకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పడంతో పూర్తిస్థాయిలో విధుల ను నిర్వహించలేకపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధికారులను నియమించి పాలన గాడిలో పడేలా చేయాలని కోరుతున్నారు.

- గద్వాల, మే23, ప్రభాతవార్త

## 50ఫీట్ల లోతు గోతులు!

- అనుమతుల పేరుతో అక్రమ ఇసుక దందా
- అధికారులే పచ్చజెండా ఊపుతున్న వైనం
- రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కుమ్మక్కు..?
- అక్రమార్కులకు నాయకుల అండదండలు



ఇసుకను హిటాచిలలో తరలిస్తున్న దృశ్యం

**మిడ్జిల్, మే 23 ప్రభాతవార్త:** అధికార పార్టీ నాయకుల అండదండలు, పోలీస్, రెవెన్యూ యంత్రాంగం కుమ్మక్కై ఇసుక అక్రమ రవాణా యధేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు స్థానికంగా గుసగుసలు వినపడుతున్నాయి. ఒక టోకెన్ ఇచ్చి పదుల సంఖ్యలో టిప్పర్ల ఇసుక రవాణా చేస్తూ లక్షలు దండుకుంటున్నా కనీసం పట్టించుకునే నాథుడే లేడని రైతులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మిడ్జిల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ పరివాహక ప్రాంతంలోని దుందుభి వాగు నుంచి అనుమతుల పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. టీఎస్ఎండిసి అధికారుల అండదండలతో మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతును రాజును చేసే దిశగా దుందుభి వాగులో నీటిని ఒడిసి పట్టేందుకు కోట్ల రూపాయలు వెచ్చించి చెక్ డ్యాంలు నిర్మించారు. ఇసుక మేటలు పేరుకుపోయి వ్యవసాయ బోరు బావుల్లో నీరు పుష్కలంగా చేరింది. ప్రస్తుతం ఇసుక వ్యాపారులు ఇష్టానుసారంగా హిటాచిలతో ఇసుకను తోడేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులే ఇసుక వ్యాపారులకు వంత పాడుతూ పట్టించుకోవడంలేదని కొత్తపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా 30 ఫీట్ల నుండి 50 ఫీట్ల వరకు గోతులు పెట్టి ఇసుకను తోడేస్తున్నారని దుందుభి వాగు పరివాహక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని దుందుభి వాగు పరివాహక ప్రాంత రైతులు కోరుతున్నారు.

## బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి : కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట, మే 23 ప్రభాతవార్త :** విసి హాల్లో జరిగిన డిసిసి సమావేశానికి చైర్మన్‌గాజిల్లా కలెక్టర్, కన్వీనర్‌గా లీడ్ బ్యాంక్ మేనేజర్ వ్యవహరించారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో వార్షిక ప్రణాళికా సంబంధించిన 2024-25 మార్చి25 తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి రూ. 2514.18 కోట్లతో వృద్ధి ఇది వార్షిక ప్రణాళికలో 76.93 శాతం మే సెగ్మెంట్ సంబంధించి రూ.153.92 కోట్లతో 61.04 శాతం ప్రగతి, ప్రాధాన్యత రంగానికి రూ.2070 కోట్లు రుణాలు మంజూరు చేయడం జరిగిందని ఎల్‌డిఎం పేర్కొన్నారు. ఈ సమావేశలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలయిన అగ్రికల్చర్, ఎమ్మెస్ ఎంఈ రంగాలకు త్వరిత గతిన అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి నారాయణపేట జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని బ్యాంకులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్బిఐ నుండి ఏజీఎం శ్రావ్య, నాబార్డ్ నుండి డిడిఎం షణ్ముఖ చారి, ఎస్బిఐ ఏజీఎం రామూర్తి, టిజిబి రీజనల్ మేనేజర్ సత్యనారాయణ, యుబిఐ నుండి శ్రీనివాస మూర్తి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు మరియు జిల్లా అధికారులు పాల్గొని వివిధ సమస్యలపై చర్చించి తగు నిర్ణయలు తీసుకున్నారని ఎల్‌డిఎం విజయ్ కుమార్ తెలిపారు. వార్షిక ఋణ ప్రణాళికా 2025,26కు గాను రూ. 4204.49 కోట్ల ఋణ లక్ష్యంతో ఏసీపి 2025,26 పుస్తక ఆవిష్కరణ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జరిగినది. ఇందులో రైతులకు పంట రుణాలు 2195.07, వ్యవసాయ ఇతర మౌలిక సదుపాయాలకి 1275.87, మొత్తంగా వ్యవసాయ రంగానికి 3470.93, స్వయం సహాయక సంఘాలకు సూక్ష్మ తరహా పరిశ్రమలకు 148, చిన్న తరహా పరిశ్రమలకు 162.30 అనగా మొత్తంగా ఎమ్మెస్ ఎంఈ రంగానికి 310.30, ఇతర వ్యవసాయేతర రంగాలకు 52.24 ఋణాలు మంజూరు చేయాలని నిర్దేశించారు. మొత్తం ప్రాధాన్యత రంగాలకు రూ.3833.48 కోట్లు వరకు రుణాలు మంజూరు చేయాలని ఋణ ప్రణాళిక నిర్దేశించడం జరిగినది. రాజీవ్ యువ వికాసం ప్రోగ్రాం ఉన్నందున బ్యాంక్ వాళ్ళు సహకరించాలని కలెక్టర్ కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



పుస్తకావిష్కరణ చేస్తున్న కలెక్టర్

## వైద్య ఆరోగ్య శాఖలో లాటరీ పద్ధతిలో స్వీపర్ పోస్టుల ఎంపిక


స్వీపర్ పోస్టుల ఎంపికకు లాటరీ తీస్తున్న అధికారులు

**గద్వాల, మే 23,ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన (3) స్వీపర్ పోస్టుల ఎంపికను లాటరీ డిప్ పద్ధతిలో ఎంపిక చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ బి.నర్సింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఐడిఓసిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక, మరియు 54 దరఖాస్తుదారుల సమక్షంలో స్వీపర్ పోస్టుల నియామకం కొరకు లాటరీ పద్ధతిలో డిప్ నిర్వ హించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇందులో ఎస్సీ మహిళ యశోద (1), జనరల్ మహిళ శివమ్మ(1), జనరల్ (ఆల్) కేటగిరిలో యం.లీలావతి (1) మొత్తం ముగ్గురు(3) స్వీపర్ కం నర్సింగ్ ఆర్డర్లీ ఆయుష్ మరియు హోమియోపతి నందు ఎంపిక చేసినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రియాంక తెలిపారు.

## మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీధర్ గౌడ్

**ఆత్మకూరు మే 23 ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలో మే 23 శుక్రవారం రోజు అమరచింత మాజీ శాసనసభ్యులు దివంగత నేత కొత్తకోట దయాకర్ రెడ్డి స్మరకర్తం మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆత్మకూరు మాజీ ఎంపీపీ శ్రీధర్ గౌడ్ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చదువుతోపాటు విద్యార్థిని విద్యార్థులకు క్రీడలు చాలా ముఖ్యమని దేహదారుధ్యాన్ని పెంపొందించుకునేందుకు క్రీడలు ఎంతో ఉపకరిస్తాయని పేర్కొన్నారు. మండలస్థాయి నిర్వహించనున్న క్రికెట్‌పోటీలలో మొదటి బహుమతిగా 50వేల ఒక వంద 16 రూపాయలు రెండవ బహుమతిగా 35 16 వేల రూపాయలను దయాకర్ రెడ్డి స్మారకార్థం రాష్ట్ర బాలల హక్కుల చైర్పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి అందజేయనున్నట్లుగా వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రహమతుల్లా పరమేష్ సైరాకవ టిఆర్ఎస్ పార్టీ నాయకులు మాసన్న ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**తెలంగాణ చైర్ పర్సన్‌గా ఎంపీ డీకే అరుణ నియామకంపై**

**బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి హర్షం**

**మహబూబ్‌నగర్, మే 23 ప్రభాతవార్త:** ఫుడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా కన్సల్టెటివ్ కమిటీ తెలంగాణ చైర్ పర్సన్‌గా ఎంపీ డీకే అరుణను నియమించడం హర్షించదగ్గ విషయం అని బిజెపి మహిళా మోర్చా మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆహార ఉత్పత్తులు, ధాన్యం సేకరణలో ఇబ్బందులు, ఇతర సమస్యలపై కమిటీ ఆధ్వర్యంలో అధ్యయనం చేసి ఇక్కడ పరిస్థితులను, ఆహార నాణ్యత విషయానికి సంబంధించి పూర్తి స్థాయిలో నివేదిక తయారు చేయనున్నారని ఇది శుభ పరిణామం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే జాతీయ మహిళా సాధికారత కమిటీ సభ్యురాలిగా, వక్క బోర్డు జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా నియమించిందని, తాజాగా మరో కీలక బాధ్యతలు అప్పజెప్పినందుకు కేంద్ర ప్రభుత్వానికి సాహితీ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**దేవరకద్ర మండల విద్యాధికారి బలరాం**


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యాధికారి

**దేవరకద్ర, మే 23 ప్రభాతవార్త :** విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని దేవరకద్ర మండల విద్యాధికారి బలరాం అన్నారు. మహబూబ్‌నగర్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కోన పాలమూర్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృంత్యతర శిక్షణలో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం శిక్షణ శిబిరంను యంఈఓ బలరాం పర్యవేక్షించి ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానంలో ఉపాధ్యాయులకు ఈ శిక్షణను అంది స్తున్నట్లు తెలిపారు. పాఠ్య ప్రణాళిక, విద్యా ప్రమాణాలు, బోధనా సోపానాలు, అభ్యసన ఫలితాలు, కరికులం విధానాలపై అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిలు శ్రీనివాస్ రెడ్డి, రాఘవేంద్ర కుమార్, నాగరాజు, తిరుపతమ్మ, రమేష్, రాఘవేందర్, శంకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## జనభేరి బహిరంగ సభను విజయవంతం చేయండి

**వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ..**


జనభేరి పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న రాచాల బృందం

**వనపర్తి క్రైమ్, మే 23 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారం హక్కుల సాధనకై బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధ ర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈనెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించ తలపెట్టిన జనభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని బీసీ పొలిటి కల్ జెఎసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జనభేరి బహిరం గ సభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ పొలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, జిల్లా లోని అన్ని సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు రాచాల యుగంధర్‌గౌడ్ అని ఇటీ వల వనపర్తి జిల్లాలో చేపట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. వనపర్తి జిల్లాలోని అన్ని మండలాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను జనభేరి సభలో ప్రస్తావిస్తామన్నారు. అదేవిధంగా సమగ్ర కుల గణన చేపట్టి, బీసీ రిజర్వేషన్లు పెంచు తూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్రానికి పంపిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి జనభేరి సభలో కృతజ్ఞతలు తెలుపుతామన్నారు. జనభేరి సభలో ప్రముఖ జానపద కళాకారులు జంగిరెడ్డి జానులిరి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున పార్టీలు, మతాలు, కులాలకతీతంగా ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి నాయకులు అరవిందా చారి, వెంకటయ్య, నాగన్న, బాలకృష్ణ, నర్సింహా, రాములు, సురేష్, ఆశన్న, బ్రహ్మయ్య, నీరెంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల కేంద్రాల వల్లే సాంప్రదాయ కళలకు జీవం

**జిల్లా విద్యాశాఖ అధికారి డా. గోవిందరాజులు**


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

**నారాయణపేట టౌన్, మే 23 ప్రభాతవార్త :** బాలల కేంద్రాల వల్లే సాంప్రదాయ శాస్త్రీయ కళలకు జీవం పోస్తున్నాదని బాల కేంద్రాలే చిన్నారులు తమకు నచ్చిన కళలు నేర్చువాలని జిల్లా విద్యా శాఖాదికారి డా. గోవింద రాజు అన్నారు. శుక్రవారం బాలకేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి కళాంశాలను ఏ విధంగా శిక్షణ ఇస్తున్నారు అని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు సూపర్‌గా నేర్పుతున్నారని డిఈఒకు తెలుపడంతో సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కో ఆర్డినేటర్ నాగార్జున్ రెడ్డి, బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, సంగ నర్సింహులు, వసంత్ కుమార్, జ్ఞానామృత వ్యాయామ ఉపాధ్యాయులు రమణ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణతో ఉపాధ్యాయుల నైపుణ్యాల అభివృద్ధి


ఉప్పునుంతల కేజీబీవీ పాఠశాలలో కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ

**ఉప్పునుంతల, మే 23 ప్రభాతవార్త :** ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయుల భాషా, గణిత సామర్థ్యాల వికాసం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమెరసీ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ కేజీబీవీ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. మే 20 నుంచి ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణలో భాగంగా మూడో రోజైన శుక్రవారం విజయవంతంగా కొనసాగింది. తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం అంశాల్లో ఉపాధ్యాయులకు శిక్షణను అందిస్తూ వారికి తరగతుల నిర్వహణలోనూ, విద్యార్థుల సమస్యల పరిష్కారంలోనూ మెలకువలను బోధించారు. శిక్షణా కార్యక్రమంలో జె.రామస్వామి, బి.రమేష్, అమీర్ పాషా, జి.వెంకటేష్, కే.చైతన్య, జి.జగదీష్, పి.మహేష్, ఎం.మల్లికార్జున్‌లు ఎస్ఆర్‌పిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ శిక్షణ ఉపాధ్యాయులకు ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుందనీ, ఇది విద్యార్థులకు చదవడం, రాయడం, గణిత సమస్యలను అర్థం చేసుకునే నైపుణ్యాలను నేర్పించడానికి దోహదపడుతుందని తెలిపారు. ఉపాధ్యాయులందరూ సకాలంలో హాజరై శిక్షణలో పాల్గొని పూర్తిగా స్థాయిలో అర్థం చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను పెంపొందించగలమని పేర్కొన్నారు.

## సైబర్ నేరాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్ గుర్తుకు రావాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**నారాయణపేట, మే 23 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ యోగేష్ గౌత మ్ ఆదేశాల మేరకు ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండా లని సైబర్ నేరాగళ్ళ పట్ల జాగ్రత్తగా ఉండాలని, అలాగే వాహన దారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జిల్లా కేంద్రంలోనీ ఓల్డ్ బస్టాండ్ సావర్కర్ చౌరస్తాలో నారాయణపేట పోలీసులు అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టే బుల్ నారాయణ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలపై పట్ల ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని వాట్సాప్, ఫేస్‌బుక్ లో వచ్చే లింకులను ఓపెన్ చేయరాదని, తక్కువ ధరకే ఆన్‌లైన్‌లో వస్తువులు దొరుకుతున్నాయని చాలామంది తెలియకుండా డబ్బులు పంపించడం జరుగుతుంది. ఆన్లైన్ రుణ యాప్స్ నుండి డౌన్‌లోడ్ చేసుకుని లోన్‌లు తీసుకోవడం వలన వాళ్లు పెట్టే బాధలకు భరించలేక చాలామంది చనిపోవడం జరుగుతుందని, చైన్ మార్కెటింగ్‌కి దూరంగా ఉండాలని, సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ ఉండరాదని, అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండి తోటి వారికి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ నేరాలు నుండి మోసపోతే వెంటనే 1930, 100 డయల్‌కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు, వాహనదారులు రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అవగాహన కల్పించారు. ప్రజలు మత్తు పదార్థాలకు బానిసలు కారాదని గంజాయి డ్రగ్స్ మద్యం, ధూమపానం మొదలైనవి వాడటం వలన మానసిక శారీరక సమస్యలతో పాటు ఆర్థిక సమస్యలు ఏర్పడి దొంగతనాలకు పాల్పడి తద్వారా ఆసాంఘిక కార్యకలాపాలు చేస్తూ చివరికి ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజలకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని కోరారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రతిరోజు యోగ, ధ్యానం చేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువకులు, ట్రాఫిక్ పోలీసులు, మొదలగు వారు పాల్గొన్నారు.

## ఆర్టికల్ 371(జె) అమలు చేయాలి

**ప్రణాళికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్. చిన్నా రెడ్డికి వినతిపత్రం ఇచ్చిన సినియర్ సిటీజన్ ఫోరం కన్వీనర్ మోహన్ రావు**


ప్రణాళిక సంగం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి కి వినతిపత్రం ఇస్తున్న మోహన్ రావు

**గద్వాల,మే 23, ప్రభాతవార్త:** అభివృద్ధిలో వెనుబడ్డ నడిగడ్డలో ఆర్టికల్ 371(జె) అమలుచేయాలని కోరుతూ సీని యర్ సిటిజన్ పోరం కన్వీనర్ శుక్రవారం హైదరాబాద్ లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి కీ సినియర్ సిటిజన్ ఫోరం చైర్మన్ మోహన్ రావు వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయంపై ఇటీవ ప్రధాన మంత్రి కార్యాలయానికి, నీతి అయోగ్‌కి కూడా లేఖ పంపడం జరిగిందని చిన్నారెడ్డికి! వివరించినట్లు మోహన్ రావు తెలిపారు. నీతి అయోగ్ ఉపాధ్యక్షులు స్పందించి లేఖ ద్వారా సంబంధిత శాఖలకు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి నివేదికలు ఇవ్వాల్సిందిగా ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించాలని అయన గద్వాలలోని జూరాల ప్రాజెక్ట్ వద్ద కృషి విజ్ఞాన కేంద్రం, అలాగే ఐఐఐటి, పరిశ్రమలు, ఎయిమ్స్ ఆసుపత్తి, గద్వాలలో100ఎకరాల రైల్వే స్థలం ఉందని ఆ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలనీ చిన్నారెడ్డ్ ని కొరారు. ఆర్టికల్ 371(జె)ద్వారా కర్ణాటక రాష్ట్రంలో అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి సుమారు 1000కోట్ల రూపాయాలు నిదులు కేటాయిస్తున్నట్లు మోహన్ రావు చిన్నారెడ్డికి వివరించారు.

## అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మురుగునీటి వద్ద పిచికారి చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ శశిధర్

**ఆత్మకూర్, మే 23 ప్రభాతవార్త :** రానున్న వర్షాకాలం సీజన్లో అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంటులు నివారణ కోసం మున్సిపల్ కార్యాలయం చేపట్టే చర్యలకు తోడ్పాటు అందించాలని ఆత్మకుర్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని రెండవ వార్డులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఫ్రైడే మరియు ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా చెత్తాచెదరని కార్యాలయ సిబ్బందితో తొలగింపజేసి అంటూ వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక కరపత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో దోమల నివారణ కోసం మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని అంతేకాకుండా రాబోయే వర్షాకాలంలో ముందు జాగ్రత్తగా అంటువ్యాధులు నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆయన వెల్లడించారు పట్టణంలోని ప్రతి వార్డులో దోమల నివారణ కోసం పిచికారి చేయడంతో పాటుగా ప్రస్తుత సీజన్లో కుక్కల భారీ నుండి రక్షించుకునేందుకు వ్యక్తిగతంగా ఎవరికివారుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు రెండోవార్డులోని మురుగునీరు విస్తృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో కార్యాలయ సిబ్బంది ద్వారా ప్రత్యేక పిచికారి చేయించడంతోపాటుగా పలు చర్యలు చేపట్టారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బందితోపాటుగా ఆర్పీలు అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించాలి


వినతి పత్రం సమర్పించిన సామాజిక ఉద్యమకారుడు డా. ప్రేమ్ కుమార్

**ఇటిక్యాల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఉంటున్న ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని సామాజిక ఉద్యమకారుడు డా. ప్రేమ్‌కుమార్ శుక్రవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ సిద్ధప్పను కలిసి వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రంలో గ్రామాలలో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని వారికి సరియైన అవగాహన లేకపోవడం వల్ల ఆస్పత్రులకు వెళ్లకుండా ఇబ్బందులకు గురవుతున్నారని అలాంటి వారికి స్థానిక మండల కేంద్రాలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని వివరించారు. అదేవిధంగా బాలికలలో రక్తహీనత. పిల్లలలో పౌష్టికాహార లోపంతో ఉంటున్నారని ఇటువంటి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఖచ్చితంగా మందులు పంపిణీ చేసి అనారోగ్యం నుండి రక్షించుకునే సలహాలు. వృద్ధులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలని అందువల్ల మండల కేంద్రాలలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలని సామాజిక ఉద్యమకారుడు డా.ప్రేమ్ కుమార్ జిల్లా వైద్యాధికారి డా. సిద్ధప్పను కలిసి వినతిపత్రం సమర్పించారు.

**ఎప్పటికప్పుడు వరి ధాన్యం దింపుకోవాలి**

## మిల్లర్ యజమానికి రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆదేశం



ఉప్పరపల్లి బిఎంఆర్ ఇండస్ట్రీస్‌ను సందర్శించిన ఆర్ఐ సుజాత

**ఉప్పునుంతల, మే 23 ప్రభాతవార్త :** రైతు పండించిన వరి ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు రాగానే అన్ లోడింగ్ చేయాలని రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజాత అదేశించారు. శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామ శివారులో ఉన్న బిఎంఆర్ ఇండస్ట్రీస్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్లోడింగ్ చేయాలని ఆదేశించారు. తరుగు పేరిట రైతులకు ఎలాంటి అన్యాయం చేయకూడదని, ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధ్యానం ఎప్పటికప్పుడు దించుకోవాలని సూచించారు. మిల్లర్ ప్రాంగణంలో భారీ సంఖ్యలో ట్రాక్టర్లపై వరి ధాన్యం ఉండడం చూసి ఆమె మిల్లర్ యజమానికి సత్వరమే రైతులు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే దింపుకోవాలని సూచించారు.

## ఈ మురుగు కాల్వకు శాశ్వత పరిష్కారం చూపించండి


రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

**మక్తల్ టౌన్, మే 23 ప్రభాతవార్త:** మక్తల్ నుండి నారాయణపేటకు వెళ్లే రహదారిలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు పూర్తిగా డ్రైనేజీ వ్యవస్థ నీరు రోడ్డుపైనే పారుతున్న తరుణంలో డ్రైనేజ్‌ని బాగు చేయడం కోసం సిమెంట్ పైపులను తీసీ వర్షం మురుగు నీరు వెళ్లే విదంగా మున్సిపాలిటీ అధికారులు సిమెంటు పైపులను తీసి రోడ్డుపైనే వదిలేశారు. వర్షాకాలం రానే వచ్చింది భారీ నుండి అతి భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉంది. ఈ మురుగునీటి వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపించే విధంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మక్తల్ పట్టణ కాలనీవాసులు కోరుకుంటున్నారు.

## అర్హులైన వారికే ఇందిరమ్మ ఇల్లు

**జనుంపల్లి శశికళ రెడ్డి**



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న దృశ్యం

**రాజాపూర్,మే 23 ప్రభాతవార్త:**రాజాపూర్ మండలం పలుగుగుట్ట తాండలో శుక్రవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి జనుంపల్లి శశికళ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో గ్రామ పంచాయతీ కార్మికుడి మృతి


మృతుడు హన్మంతు (ఫైల్)


**మక్తల్, మే 23 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని కర్ని గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు బోయ హన్మంతు(52) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. హన్మంతు గత కొంతకాలంగా గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత రెండు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. గురువారం హన్మంతుకు శస్త్ర చికిత్స జరగగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం చెందాడు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మోహన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సహాయం అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు


చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, మే 23 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం తోమలపల్లి గ్రామంలో శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలోని 6 గురుకి సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. జి.రవికుమార్‌కు రూ.60వేలు, బండారు భాగ్యమ్మకు రూ.60, జి భాను ప్రకాష్ కు రూ.10వేలు, జి.భారతమ్మకు రూ.14వేలు, పూజితకు రూ.13 వేలు ,అరుణమ్మకు రూ.5వేలు సీఎం అఫ్‌చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులు వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, నాయకులు రంగన్న యాదవ్, డైరెక్టర్ రామన్ గౌడ్, చంటి, శ్రీనివాస్ యాదవ్, రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ ఇంటర్ డిస్టిక్ టోర్నమెంటును ప్రారంభించిన ఎస్సై


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పెబ్బేరు ఎస్ఐ

**పెబ్బేరు,మే23 ప్రభాతవార్త:**పెబ్బేరుమున్సిపాలిటీలో శుక్రవారం రోజు క్రికెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంటును పెబ్బేర్ ఎస్సై యుగంధర్ రెడ్డి టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. శుక్రవారం ఆడిన నారాయణపేట, వనపర్తి రెండు జట్లలో పోటాపోటీగా ఆడి వనపర్తి టీం గెలిచిందని క్రికెట్ నిర్వాహకులు శంకర్ తెలియజేశారు. క్రికెట్ ప్రారంభించిన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, క్రీడాభిమణులు పాల్గొన్నారు.

